ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 7 జులై 2024



కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి, జులై 6: జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు 2024-25 సంవత్సరానికి సంబంధించి రెన్యువల్ చేసుకోడానికి దరఖాస్తు చేసుకోవాలని ఐడెంటిఫైడ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి సర్వీసులో ఉన్న వారు ఈ రెన్యువల్‌కు అర్హులన్నారు. అర్హతున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఈ నెల 9 లోగా తమ దరఖాస్తులను ఆయా కళాశాలల్లో అందజేయాలన్నారు. వాటిని కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ నెల 11 లోగా తమకు అందజేయాలని చీపురుపల్లి ఐడీ ప్రిన్సిపాల్ తమ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంత మార్పు?

- బదిలీల్లో పక్కన పెట్టిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు
- కంగుతిన్న పంచాయతీ కార్యదర్శులు
- వీటి ఆధారంగానే బదిలీలు చేసిన గత వైసీపీ ప్రభుత్వం
- జోక్యం ఉండదని సంకేతాలిచ్చిన కూటమి సర్కారు



● శృంగవరపుకోట బాగా ఆదాయ వనరులున్న మేజర్ పంచాయతీ. ఇక్కడ పనిచేసేందుకు కార్యదర్శులు పోటీపడతారు. జిల్లాలో పది మంది కార్యదర్శులు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పంచాయతీలకు పదోన్నతి పొందారు. వీరిలో గజపతినగరం మండల పరిధిలోని ఓ గ్రామ కార్యదర్శి ఈ పంచాయతీలో పనిచేసేందుకు ఉత్సాహం చూపుతూ అధికార పార్టీ ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ పొందారు. అయితే శుక్రవారం జరిగిన బదిలీల్లో ఈ స్థానం అతనికి దక్కలేదు. ఆయనొక్కరికే కాదు సిఫార్సు లేఖలు అందించిన వారిలో ఒక్కరంటే ఒక్కరికి కూడా ఆశించిన స్థానం దక్కలేదు.

● గ్రేడ్-1 స్థాయి గ్రామ పంచాయతీ శృంగవరపుకోటకు కార్యనిర్వాహక అధికారి ఎవరూ లేకపోవడంతో ఈవోపీఆర్డీ ఇన్‌చార్జిగా వ్యవహరించేవారు. పంచాయతీ ఎన్నికల తరువాత గ్రేడ్-1 స్థాయి పంచాయతీ కార్యదర్శిని అప్పటి వైసీపీ నాయకులు కార్యనిర్వాహక అధికారిగా నియమించుకున్నారు. ఏడాది తరువాత అతనికి పదోన్నతి రావడంతో గ్రేడ్-2 స్థాయి అధికారిని ఈ పంచాయతీ కార్యదర్శిగా రప్పించారు. ఈయన వైసీపీలోని ఒక వర్గానికే పని చేస్తున్నారన్న అనుమానంతో ఏడాది తిరక్కుండానే అప్పటి శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు కొత్తవలసకు బదిలీ చేయించారు.

శృంగవరపుకోట జులై 6:

..ఇదీ వైసీపీ, టీడీపీ ప్రభుత్వాల మధ్య తేడా. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎవరికి చెబితే వారికే కోరుకున్న స్థానాలు దక్కేవి. రాజకీయ అండలేని ఉద్యోగులు, అధికారులు ఎక్కడకు బదిలీ చేస్తే అక్కడకు వెళ్లాల్సిందే. నేతలు చెప్పినట్లు వినకున్నా బదిలీ వేటుకు గురికావాల్సిందే. దీంతో పనిచేస్తున్న చోట ఎన్నాళ్లుంటారో తెలియని పరిస్థితి. ఎప్పుడు ఎవరు ఏ తప్పు చేయిస్తారోనన్న భయం వెంటాడేది. ఎంత అనుకువగా ఉన్నా ఎవరో ఒక నాయకుడు తాము చెప్పినట్లు వినలేదన్న ఫిర్యాదుతో ఆకస్మికంగా బదిలీ చేసిన సంఘటనలెన్నో. ఈ పరిస్థితి రాకుండా ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం పదోన్నతులు పొందిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఇందుకు ఉదాహరణ. ఈ బదిలీల్లో జిల్లా ఉన్నతాధికారులు ఎక్కడా రాజకీయ జోక్యానికి తావివ్వలేదు. తద్వారా రాబోయే రోజుల్లోనూ అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండబోదన్న సంకేతాలను కూటమి ప్రభుత్వం ఇచ్చినట్లవుతోంది. ఇదే విషయం జిల్లా ఉన్నతాధికారులకు కూడా నిర్దేశించినట్లు తెలిసింది.

బదిలీలకు పట్టు..


సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. దీంతో ఈ పార్టీల తరుపున గెలిచిన శాసన సభ్యులను పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రసన్నం చేసుకోనే పనిలో పడ్డారు. ప్రభుత్వం బదిలీలు చేపడితే కోరుకున్న స్థానాల్లో కూర్చొనేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలెట్టారు. ఏం చెబితే అది చేస్తామని కొందరు, ఆ స్థానాలకు పంపిస్తే ఎంతైన ఇస్తామని మరికొందరు ప్రలోభపెడుతున్నారు. ఇప్పటికే చాలా మంది అధికారులు, ఉద్యోగులు ప్రజాప్రతినిధుల నుంచి ఆశించిన స్థానాలకు వెళ్లేందుకు హామీలు పొందారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులు కూడా వీరిలో ఉన్నారు. అప్పుడు వాళ్లు చెప్పినట్లు చేశాం, ఇప్పుడు మీరేది చెబితే అదిచేస్తామంటుండడంతో వీరి ప్రతిపాదనలను అంగీకరిస్తున్నట్లు సమాచారం.

అప్పుడలా.. ఇప్పుడిలా..

శృంగవరపుకోట మండలంలో ఎన్నికల ముందు వరకు ఓ అధికారి పని చేశారు. వైసీపీ నాయకులు చెప్పేపనులు మాత్రమే చేసేవారు. ఇతనున్నాన్నాళ్లు టీడీపీకి చెందిన నాయకులెవరూ కార్యాలయం వద్ద కనిపించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఇదే అధికారి ఈ మండలానికి చెందిన టీడీపీ నాయకులతో పాటు పక్క మండలాలకు చెందిన నాయకుల సహకారంతో తిరిగి ఇక్కడకు వచ్చేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఈమండలానికి వచ్చేందుకు అన్ని స్థాయిల్లో వున్న ప్రజా ప్రతినిధులు ఒప్పకున్నారని చెబుతుండడంతో ఇతనితో ఇబ్బందులు పడ్డ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు మింగలేక, కక్కలేక గుడ్లురిమి చూస్తున్నారు. ఇది ఉదాహరణ మాత్రమే. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇలాంటి పరిస్థితులు వున్నాయి. వైసీపీ నాయకులకు అనుకూలంగా పని చేసిన అధికారులు ఎక్కువగా టీడీపీ ప్రజా ప్రతినిధులను కలుస్తున్నారు.

ప్రభుత్వం ప్రస్తుతం కలెక్టర్ల వరకు మాత్రమే బదిలీ చేసింది. పోలీస్ శాఖ నుంచి జిల్లా స్థాయిలో ఇంకా బదిలీ ప్రక్రియ జరగలేదు. సార్వత్రిక ఎన్నికల కోసం పంచాయతీ రాజ్, రెవెన్యూ, పోలీస్ శాఖలకు వేర్వేరు జిల్లాల నుంచి మండలాలకు వచ్చారు. వీరంతా తిరిగి ఆయా జిల్లాలకు వెళ్లాలి. వేర్వేరు జిల్లాలకు వెళ్లిన జిల్లా అధికారులు ఇక్కడకు రావాలి. ఈ ప్రక్రియ జరిగిన తరువాతే బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు రావొచ్చు. ఈలోపే కోరుకున్న స్థానాలకు వెళ్లేందుకు ప్రజా ప్రతినిధుల అనుమతుల కోసం చూస్తున్నారు. ఇప్పటికే కొంత మందికి గ్రీన్ సిగ్నల్ దొరికేసింది. అయితే పదోన్నతి పొందిన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ప్రజా ప్రతినిధులు సిఫార్సులకు విలువ లేకపోవడంతో ఇలాంటి వారంతా పునరాలోచనలో పడ్డారు.

నేతలకు ఎస్‌ఈబీ



- అనేక విమర్శలు ఎదుర్కొన్న ప్రత్యేక విభాగం
- సారా తయారీ, రవాణా నియంత్రణలో వైఫల్యం
- బెల్టు షాపుల జోలికి వెళ్లని వైనం
- వైసీపీ చెప్పుచేతల్లో పనిచేసి తరించిన అధికారులు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ). ఈ పేరు వినగానే అమ్మో ఇదేదో అక్రమార్కుల తాటతీసే గట్టి విభాగం అనిపిస్తోంది కదూ.. కాని అలా జరగలేదు. వైసీపీ నేతలు ఏం చెబితే అది చేసే విభాగంగా విమర్శలు ఎదుర్కొంది. అప్పటి నాయకులు, వారి అనుచరులు చేసిన అక్రమ వ్యాపారాలకు తెరచాటు సహకారం అందించి అభాసుపాలైంది. ఈ విభాగాన్ని ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడే 2020లో ఏర్పాటు చేశారు. జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక వ్యాపారాన్ని వైసీపీ నాయకులు చేస్తుంటే తెలిసీ వదిలేశారు. వారికున్న అధికారాలను విడిచి పెట్టేసి ఏకంగా వైసీపీ ప్రజాప్రతినిధుల సేవలో మునిగారు.

సారా నియంత్రణ.. మద్యం షాపుల నియంత్రణకు గతంలో ఎక్సైజ్ శాఖ ఉండేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం అమ్మకాలను ప్రభుత్వపరం చేసింది. ఎక్సైజ్ శాఖ స్థానంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను తెచ్చింది. సారా వినియోగం, బెల్టుషాపుల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణాను అరికట్టడం తదితర ప్రధాన విధులతో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఉమ్మడి జిల్లాలోని నాగావళి, జంఝావతి, సువర్ణముఖీ, చంపావతి, వేగావతి, గోస్తనీ నదుల నుంచి విచ్చలవిడిగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నా కనీస చర్యలు చేపట్టలేదు. జేపీ సంస్థ అక్రమంగా ఇసుకను తోడేసుకున్నా పట్టించుకోలేదు. ఇప్పటికీ గ్రామ స్థాయిలోని వైసీపీ నాయకులు ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక వ్యాపారాలు చేస్తున్నారు.

జిల్లాలో బెల్టు షాపులు వందల సంఖ్యలో ఉన్నాయి. విచిత్రం ఏమంటే ప్రభుత్వ మద్యం షాపులు, బార్లు ఉన్న చోటుకు సమీపంలోనే బెల్టు షాపులు ఉండడం. గ్రామగ్రామానా నడుస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీసుకుంటే రెండు వేల వరకు బెల్టు షాపులున్నట్లు అంచనా. ఇంత పెద్ద ఎత్తున బహిరంగంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. మరి సెబ్ ఎం చేస్తున్నట్లు? మామూళ్లు అందిపోతుండేవి అన్నది ప్రధాన ఆరోపణ. గ్రామాల్లో బెల్టుషాపులు వేలం వేసి మరీ నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధికి నిధుల పేరుతో వేలం వేస్తున్నారు. దీంతో వీరిని గ్రామ స్థాయిలో అడిగే నాథుడే లేకపోయాడు.

ఏరులైన సారా

జిల్లాలో సారా ఏరులై పారుతోంది. ఇదివరకు ఒడిశా సరిహద్దుల్లోని ఒడిశా ప్రాంతాల్లో వంటకాలు సాగేవి. ఇపుడు ఏకంగా మన బోర్డర్‌లోనే వంటకాలు సాగిస్తున్నారు. మెంటాడ, బొబ్బిలి మండలం నారసింహునిపేట, రామభద్రపురం, ఎస్‌.కోట, వేపాడ, మక్కువ, సాలూరు, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో విచ్చలవిడిగా సారా తయారవుతోంది. సారా అమ్మకందార్లు ఎంత తెలివి మీరారంటే వీరు సారా అమ్ముతూ ఖరీదైన మద్యాన్ని సేవిస్తున్నారు. దీనికి కారణం సారా ప్రమాదమని వారికి తెలుసు. దీనికి తోడు భారీగా ఆదాయం వస్తోంది.

సంస్కరిస్తారో.. విలీనం చేస్తారో

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను సమూలంగా సంస్కరించాల్సి ఉంది. విధులు, బాధ్యతలు తూచా తప్పకుంటా చేపట్టేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. కొత్తగా ఏర్పాటైన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంపై ఈ గురుతర బాధ్యత ఉంది. పోలీస్ శాఖలో విలీనం చేయటమే మంచిదన్న వాదన విన్పిస్తోంది. ప్రస్తుతం సెబ్‌లో ఎడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి నుంచి కానిస్టేబుల్ వరకు ఉద్యోగులు ఉన్నారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

రథయాత్రకు సర్వం సిద్ధం

రోజుకో అవతారంలో జగన్నాథుడు

(విజయనగరం రూరల్)



జగన్నాథుని రథయాత్రకు సర్వం.. సిద్ధమైంది.. ఆషాఢమాసంలో వచ్చే ఈ పండగను జిల్లా ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీ. తొలి రథయాత్ర నుంచి మారు రథయాత్ర వరకూ రోజుకో అవతారంలో స్వామి భక్తులకు దర్శనమిస్తారు. రథంపై సుభద్ర, జగన్నాథస్వామి, బలభద్రుడు కొలువుదీరుతారు. ఆలయంలో పూజలు అనంతరం తొలి రథయాత్ర రోజు, అదే విధంగా మారు రథయాత్ర రోజు ముఖ్య కూడళ్లల్లో రథం మీద స్వామి ఆశీనులై దర్శనమిస్తారు. తొలి రథయాత్ర నుంచి మారు రథయాత్రకి మధ్య శీలవిరుపు తంతును అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆ రోజు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారు. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, ఎస్‌.కోట, గంట్యాడ, గుర్ల, నెల్లిమర్ల, చీపురుపల్లి, జామి, బొండపల్లి, మెంటాడతో పాటు పలు ప్రాంతాల్లో జగన్నాథుని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలతో పాటు ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు తొలి రథయాత్ర జరగనుంది. విజయనగరంలోని దాసన్నపేటలో పురాతన జగన్నాథ స్వామి ఆలయం, మన్నార్ రాజగోపాల స్వామి ఆలయం, సంతపేట వద్ద వున్న పురాతన జగన్నాథ స్వామి ఆలయం, కాళ్లనాయుడు మందిరం వద్ద వున్న జగన్నాథ స్వామి ఆలయం, చిక్కాలవీధి ఆలయం తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం రథయాత్ర ఉంటుంది.

ఎన్నికల నిధులొస్తాయా?

- ఎదురుచూస్తున్న బీఎల్‌వోలు
- రాజాంలో అందని బిల్లులు



రాజాం రూరల్, జులై 6: ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిధులను విడుదల చేయడం లేదు. ఎదురు చూసిన బూత్‌లెవెల్ అధికారులు నిరాశ చెందు తున్నారు. తమ చేతిచమురు వదిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన మొత్తంకన్నా ఎక్కువ మొత్తం ఖర్చు చేసిన బీఎల్ వోలు బకాయిల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ఎన్నికలు జరిగి 50 రోజులు దాటినా నిధులు విడుదల కాలేదు. బకాయిలపై ఆశలు వదులు కోవాల్సిందే నన్న ఆందోళన బీఎల్‌ఓలలో నెలకొంది. అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడం, బకాయిల గురించి అధికారుల్ని ప్రశ్నించే ధైర్యం చేయలేకపోవడంతో మిన్నకుండిపోతున్నారు. అయితే విడుదలైన నిధుల్ని అధికారులు స్వాహా చేశారేమోనన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలుండగా రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలు మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో ఒక్కో బీఎల్‌ఓకు రూ.8 వేలు వంతున రెవెన్యూ అధికారులు అందజేశారు. ఈ రెంటింట రూ.5వేలు మాత్రమే ఇచ్చారు.

● పోలింగ్ నిర్వహణకు ప్రతి బూత్‌కు రూ.8 వేలు వంతున ఇచ్చేలా ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్ స్టేషన్ ఆవరణలో టెంట్లు, తాగునీరు, ఫర్నీచర్, పోలింగ్ సిబ్బందికి టీ, కాఫీలతో పాటు టిఫిన్లు, భోజనాలు, ఇతరత్రా ఏర్పాట్ల కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేయాల్సి ఉంది. టిఫిన్, భోజనానికి సంబంధించి ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా మెనూ కూడా విడుదల చేసింది. మే 13న సజావుగా ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు కూడా వెలువడ్డాయి.

● రాజాం నియోజకవర్గంలో ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి బీఎల్‌వోకు రూ.8 వేలు ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రూ.5 వేలు వంతున రెవెన్యూ అధికారులు అందజేశారు. ఎన్నికల అనంతరం మిగిలిన మొత్తాన్ని అందజేస్తామని మే 11న రెవెన్యూ అధికారులు బీఎల్‌ఓలకు సర్దిచెప్పారు. దీంతో చేసేదిలేక బీఎల్‌ఓలు పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కాగా ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు రూ.3 వేలు వంతున రూ.8,52,000 బకాయిలు రావాల్సి ఉంది. చీపురుపల్లిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

బిల్లులు పెట్టాం

రూ.34 లక్షల బడ్జెట్ కోసం బిల్లులు పెట్టాం. ఈ మొత్తం కాకుండా ట్రెజరీలో రూ.9 లక్షల బిల్లులు గ్రీన్‌చానల్‌లో ఉన్నాయి. ఇంకా నిధులు విడుదల కాలేదు. మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంది. వీడియోగ్రాఫర్లతో పాటు మరికొంతమందికి బకాయిలు ఉన్నాయి. నిధులు విడుదల కాగానే చెల్లింపులు చేపడ్తాం.

జోసెఫ్, రిటర్నింగ్ అధికారి, రాజాం నియోజకవర్గం

బ్యాంకులు సహకరించాలి

- పథకాల అమలులో జిల్లా ముందుండాలి
- కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద నిర్దేశిత లక్ష్యాల మేరకు రుణ సహాయం అందించడం ద్వారా జిల్లా అభివృద్ధికి బ్యాంకులు సహకరించాలని కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోరారు. అన్ని ప్రభుత్వ పథకాల అమలులో రాష్ట్రంలోనే మన జిల్లా ముందు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో బ్యాంకు అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్ల సమన్వయ కమిటీ మొదటి సమావేశం శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ పథకాల అమలులో యూనిట్ల ఏర్పాటు చాలా తక్కువగా ఉందని, వచ్చే సమావేశం నాటికి ఆయా బ్యాంకు బ్రాంచులు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నగరంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల పేరుతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీలను ఆదేశించారు.

నెలాఖరులో మరో సమావేశం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి క్వార్టర్‌లో సాధించిన ఫలితాలపై సమీక్ష కోసం ఈ నెలాఖరులో మరోసారి బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని ఎల్‌డీఎం రమణమూర్తికి ఆదేశించారు. స్టాండప్ ఇండియా కింద ప్రతి బ్యాంకు బ్రాంచి పరిధిలో ఇద్దరు ఎస్సీ లబ్ధిదారులకు తప్పనిసరిగా రుణాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందని, జిల్లాలోని పలు బ్యాంకులు ఈ లక్ష్యాలను చేరుకోలేదని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు గణపతి చెప్పారు. ఈ ఏడాది ఇప్పటికే కౌలు రైతుల గుర్తింపు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, గుర్తింపు త్వరగా పూర్తి చేసి అర్హులకు రుణాలు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. మండల స్థాయిలో పథకాల అమలుపై సమీక్ష కోసం నిర్వహించే జెఎంఎల్‌బిసి సమావేశాలు ఎన్నికల కారణంగా గత మూడు నెలలుగా జరగడం లేదని, ఆయా ప్రాంతాల్లో యూనిట్ల ఏర్పాటులో ఉన్న సమస్యలు చర్చించే అవకాశం ఉండటం లేదని, వెంటనే ఈ సమావేశాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని నాబార్డు ఏజీఎంకు సూచించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ అధికారి వైవీ రమణ , డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్ర, మెప్మా పీడీ సుధాకర్, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, బిసి కార్పొరేషన్ ఈడి పెంటోజీ, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి సుధారాణి, ఎస్‌బిఐ ఏజీఎం సురేష్‌బాబు, యూనియన్ బ్యాంకు ఏజీఎం నరేష్, రిజర్వు బ్యాంకు ఎల్‌డీఎం ఎస్‌కె సునీల్, ఏఎల్‌డీఎం ప్రత్యూష తదితరులు హాజరయ్యారు.



అండగా ఉండండి

- కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అశోక్ దిశానిర్దేశం
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ఘన స్వాగతం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ప్రజలకు అండగా ఉంటూ.. అభివృద్ధే అజెండాగా ముందుకు సాగాలని కేంద్ర మాజీ మంత్రి.. పొలిట్ బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతి రాజు నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఎంపీగా ఎన్నికై పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశాక జిల్లాకు శనివారం మొదటి సారిగా వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడుకు ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా అశోక్ బంగ్లాలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో అశోక్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలకు మంచి భవిష్యత్ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజ లకు అండగా ఉండాలని కోరారు. అపుడే రాజకీయంగా భవిష్యత్ ఉంటుందని చెప్పారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే(జనసేన) లోకం నాగమాధవి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రెడ్డి పావని మాట్లాడారు.

● పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు తనపై గురుతర బాధ్యతలు అప్పగించారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. పెద్దలు అశోక్ గజపతిరాజు వంటి సీనియర్ల సలహాలు సూచనలు తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తానన్నారు. కేంద్రం ద్వారా రాష్ట్రాని రావాల్సిన నిధులు, సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు.


ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న అశోక్

● విశాఖ నుంచి వచ్చిన ఎంపీ కలిశెట్టికి విజయనగరం సరిహద్దు రాజాపులోవ వద్ద పార్టీ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి ఎంపీ ఓపెన్ టాప్ వాహనంలో పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకుని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

అందర్నీ కడుపుబ్బా నవ్వించే డార్లింగ్



నిర్మాతలుగా 'హను-మాన్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య. లేటెస్ట్‌గా ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'డార్లింగ్' చిత్రాన్ని నిర్మించారు. 'వై దిస్ కొలవెరి' అనేది ఉప శీర్షిక. అశ్వనీ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చైతన్య మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

'కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. యూత్, ఫ్యామిలీ ఇలా..ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమాను దర్శకుడు తీర్చిదిద్దారు. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. ఈ పాత్రలకి ప్రియదర్శి, నభానటేశ్ సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లకీ సమ ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. వివేక్ సాగర్ సంగీతం సినిమాకు స్పెషల్ హైలైట్. 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది. ఈ సినిమాలో హనుమంతుడి పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం సస్పెన్స్" అని చెప్పారు.

అనాథలే స్టార్స్

సంజయ్ శ్రీరాజ్‌ను హీరోగా, ప్రియా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు ధర్మ మాట్లాడుతూ 'నెల్లూరులో చిత్రాన్ని నిర్మించాం. ఓ గల్లీలో నివసించే అనాథలు ఎదుర్కొనే సమస్యలను



చిత్రంలో వివరించాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత డాక్టర్ అరవేటి యశోవర్ధన్ మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా చుట్టూ చిత్రకథ నడుస్తుంది. ఇందులో నాలుగు పాత్రలు ప్రముఖంగా ఉంటాయి. అనాథలైన వారి జీవితాలు ఎలా ఎవరి వల్ల మలుపు తిరిగిందో చూపించాం. మాస్ ఆడియన్స్‌కు నచ్చేసినిమా ఇది' అని చెప్పారు.

దర్శకధీరుడిపై డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళిపై ఓ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ ఖన్నా దర్శకత్వంలో 'ద మోడరన్ మాస్టర్స్' పేరుతో ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తోంది. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. దర్శకుడిగా రాజమౌళి ప్రయాణాన్ని.. ఆయన ఇండియన్ సినిమాపై చూపిన ప్రభావాన్ని ఇందులో చూపించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి గురించి ఆయన బంధుమిత్రులు, దర్శకులు జేమ్స్ కామెరూన్, రుస్సో బ్రదర్స్, హీరోలు రానా, ప్రభాస్ తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.

బడ్డీ హార్ట్ టచింగ్ సాంగ్



అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ' ఈ నెల 26న విడుదల కానుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని జ్ఞానవేల్ రాజా, అధన నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'చూసాలే నాలో నీ కలనే.. దాచాలే దాచాలే నాలో ఆ కలనే' అంటూ సాగే ఈ హార్ట్ టచింగ్ సాంగ్‌ను సాయి హేమంత్ రాశారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచి ఐరా ఉడిపితో కలసి పాడారు. గాయత్రి భరద్వాజ్, అజ్మల్, అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేశ్‌కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాత.

ఆధారాలు సమర్పించండి..



హీరో రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు

సినీ హీరో రాజ్‌తరుణ్ తనను మోసగించాడంటూ ఫిర్యాదు చేసిన లావణ్య అనే మహిళకు నార్సింగ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను విచారణ నిమిత్తం తమకు సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. లావణ్య ఆధారాలు సమర్పిస్తేనే ఈ కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుంది. లేదంటే కోర్టు అనుమతితో పోలీసులు కేసును చట్ట ప్రకారం మూసివేస్తారు.

శేఖర్ కమ్ముల చేతుల మీదుగా...



సాయితేజ కల్వకోట, పావని కరణమ్ జంటగా నటిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ హాస్యభరిత వ్యంగ్య చిత్రాన్ని యాడ్ ఫిల్మ్‌మేకర్ ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొదుల నిర్మించారు.శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'సోడు సోడు' పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ పాటకు మంచి సాహిత్యంతో పాటు ఆకట్టుకునే సంగీతం తోడైంది' అని చెప్పారు. 'పూర్తి స్థాయి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రమిది" అని నిర్మాత రామకృష్ణ బొదుల తెలిపారు. ఈ పాటకు ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి సాహిత్యం అందించగా, యశ్వంత్ నాగ్‌నారు సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ కుర్మన, డీఓపీ: సందీప్ బొద్దుల.

దిక్సూచి

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించినకౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.

ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు



ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్పయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందల కొద్ది ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు.

అవకాశం ఒక్కసారే: ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు మిగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికి రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏమైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం.

మొదటి అవకాశమే మంచిది: ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్సులు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి.

లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి: కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



ప్రొఫెసర్ ఎస్.వి.రమణారావు
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 - 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/

తెలంగాణ
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 - 23
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024 (అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్‌ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/r1mnRyKతో చదవండి.

ఉపాధి కల్పనలో వైసీపీ విఫలం

- నిరుద్యోగ యువతకు శిక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక
- ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనలో వైసీపీ ప్రభు త్వం విఫలమయ్యిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. గత పాలకులు నిర్లక్ష్యం వల్ల అనేక మంది చదువుకున్న యువత వలసబాట పట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు శిక్షణనందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. శనివారం విజయనగరంలోని మహిళా ప్రాంగణంలోని టీటీడీసీ స్కిల్ కాలేజ్‌లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా సీడాప్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి మంత్రికి వివరించారు. కాగా ఎస్‌బీఐ ఆర్‌సెటీకేంద్రంలో జరుగుతున్న శిక్షణ, ఉద్యోగావకాశాల గురించి ఆ సంస్థ డైరెక్టర్ జీబీవీ రమణ వివరించారు. బోకే మొక్కల విక్రయాల కేంద్రాన్ని మంత్రి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు సందర్శించారు. ప్రాంగణంలోని పలు ఉపాధి, శిక్షణా సంస్థలు, తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకులు నైపుణ్య శిక్షణను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇంజినీరింగ్ కళా శాలల్లో సైతం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు కొరవడ్డా యన్నారు. విజయనగరం జిల్లాలో ఫార్మా, విశాఖ జిల్లాలో హోటల్ పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో వాటికి అనుగుణంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కేంద్రాన్ని విస్తరించి, ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధిని వైసీపీ పాలకులు విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీడీ సావిత్రి, ఉద్యానవన శాఖ ఏడీ జమదగ్ని, జిల్లా ఉపాధి అధికారి అరుణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు, జేడీఎం మార్టిన్, డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ అభివృద్ధికి సహకారం..

విజయనగరం రూరల్: డీసీసీబీ అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీఇచ్చారు. విజయనగరంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకుని నాబార్డు సహకారంతో డీసీసీబీ ఏర్పాటుచేసిన రెండు సంచార వాహనాలను ప్రారంభించారు. సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు డిపాజిట్లు పెంచాలన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్ సత్యనారాయణ, జేసీ కార్తీక్, నాబార్డు డీడీఎం నాగార్జున, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలకపాత్ర

- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


జామి: కుమారాంలో బాలికలకు స్టూడెంట్స్ కిట్లు అందజేస్తున్న లలితకుమారి

జామి: దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలక పాత్ర అని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాం క్షించారు. శుక్రవారం మండలంలోని కుమరాం కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు జయశ్రీ, గంగరాజు, తహసీల్దార్ రాంబాయ్, ఎంపీడీవో తిరుమలరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు, టీడీపీ విశాఖ పార్ల మెంట్ మహిళ ప్రతినిధి మాకిరెడ్డి శ్రీలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు పోలిపర్తి స్వామినా యుడు, పార్టీ మండలకార్యదర్శి వర్రి రమణ, రాయవరపు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

- జామి మండలంలోని జట్టేడివలస సచివాలయాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరిశీలించి, ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఉద్యోగులు చంద్రబాబు చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమారి, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాయవరపు శంకర్, వెంకట సత్యం,సంతోష్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి పూర్వవైభవం తీసుకువస్తా

- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి: బాడంగి సీహెచ్‌సీకి పూర్వవైభవం తీసుకొస్తామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. శనివారం బాడంగి సీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి చేస్తానన్నారు. గత ప్రభుత్వం ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్వీర్యంచేసిందని ఆరోపించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మం నాయుడు,తెంటు రవిబాబు, వైద్యులు పెద్దింటి నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.


సీహెచ్‌సీలో పరిశీలిస్తున్న బేబీనాయన

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధురాలి మృతి

గజపతినగరం: మదుపాడ గ్రామం వద్ద గల జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన పేలూరు చిట్టమ్మ (68) బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మరుపల్లి నుంచి గజపతినగరం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన చిట్టమ్మను విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్ల వారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుమార్తె నక్క జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేస దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

చీపురుపల్లి: పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ శనివారం మృతిచెందింది. ఈ ఘటనపై చీపురుపల్లి ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీపురుపల్లి మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బొమ్మిరోతు పార్వతి అనే మహిళ ఈనెల 1న పురుగు మందు తాగింది. కుటుంబీకులు గమనించి, చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పరశురాంపురంలో వృద్ధుడు..

రాజాం రూరల్: మండలంలోని పరశురాంపురం గ్రామానికి చెందిన బెవర అప్పలరాము (73) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ అల్లు లక్ష్మునాయుడు తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో ఈనెలరెండోతేదీనఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము పురుగుల మందు తాగాడు. రాత్రి పదిగంటల సమయంలో ఇంటికి చేరడంతో పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు రాజాంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. అప్పలరాము భార్య అన్నపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

పోలీసులను ఆశ్రయించిన నవ దంపతులు

- యువకుడిపై యువతి బంధువుల దాడియత్నం, బెదిరింపులు

రాజాం రూరల్: రాజాంలో నవ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల వివాహం చేసుకున్న ఆ జంట తమకు రక్షణ కల్పించాలని కోరుతోంది. కొంత కాలంగా ప్రేమించుకుంటున్న వారిద్దరూ ఇటీవల వివాహం చేసుకున్నారు. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని జగన్నాథకాలనీకి చెందిన వ్యాపారం చేస్తున్న కొత్తకోట వెంకటేశ్, ఈశ్వర నారాయణ కాలనీకి చెందిన మెడిసిన్ విద్యార్థిని వారణాశి లక్ష్మిసోమిదేవి మధ్య స్నేహం ప్రేమగా మారింది. దగ్గర బంధువులు కావడంతో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న లక్ష్మిసోమిదేవి తండ్రి గురునాథ్ పెళ్లికి నిరాకరించగా, వెంకటేష్ తండ్రి నాగేశ్వరరావు నుంచి అభ్యంతరం రాలేదు. స్నేహితుల సహకారంతో గతనెల ఐదోతేదీన అన్నవరం సత్యనారాయణస్వామి సన్నిధానంలో వివాహం చేసుకున్నారు. జూన్ 12న రాజాంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మేరేజ్ కూడా చేసుకున్నారు. ఈనేపథ్యంలో లక్ష్మి సోమిదేవి తండ్రితోపాటు బంధువులు కొద్దిరోజులుగా వెంకటేశ్‌ను ఫోన్లో బెదిరిస్తున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు బయలుదేరిన వెంకటేష్‌పై ఈనెల ఐదో తేదీన రాజాంలో బొబ్బిలి నుంచి రెండు కార్లలో వచ్చిన లక్ష్మిసోమిదేవి బంధువులు దాడికి ప్రయత్నించారు. ఇది గమనించిన వెంకటేశ్ తన స్నేహితుల సహకారంతో బయటపడ్డాడు. ఈవిషయాన్ని రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడులు చేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంకటేశ్, లక్ష్మి సోమిదేవి దంపతులు వాపోతున్నారు. న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించామని, అయినా మాకు భయంగానే ఉందని, మమ్మల్ని విడదీయాలని ప్రయత్నిస్తే ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు. కాగా పరస్పర అంగీకారం, ఇష్టంతో ఒక్కటైన జంటకు న్యాయం చేస్తామని రాజాం టౌన్ సీఐ మోహనరావు తెలిపారు. ఇద్దరూ మేజర్లే కావడంతో వారి వివాహం చట్టపరంగా చెల్లుబాటు అవుతుందని చెప్పారు. వెంకటేశ్, లక్ష్మి సోమిదేవి జోలికి పోవద్దని ఇరు కుటుంబాల పెద్దలను హెచ్చరించినట్లు తెలిపారు. వారిపై బైండోవర్‌చేశామని, వారికి ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తప్పవని చెప్పారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గజపతినగరం: ట్రాక్టరుతో పాటు దమ్ము సెట్లు చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు.శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజపతినగరం మండలంలోని రామన్న పేటగ్రామానికి చెందిన మనిపూరి గోవింద, జిన్నాం గ్రామానికి చెందిన ఇజ్జిరోతు సత్యనారాయణ తమ దమ్ము సెట్లు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో బొలెరో వాహనంలో విజయనగరంలో వాటిని నిందితులు అమ్మకానికి తీసుకువెళుతుండగా గజపతినగరంపైడితల్లి అమ్మవారి గుడి వద్ద దాడులు చేశామని చెప్పారు. గుర్ల మండలం లవిడాంగ్రామానికి చెందిన మీసాల గోవింద, మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామానికి చెందిన కొండ్రు గౌరునాయుడుతో పాటు వారికి సహకరించిన లవిడాం గ్రామానికి చెందిన గొర్లె నరేంద్ర, కొంకి పైడిరాజులను అరెస్టు చేశామన్నారు. గరివిడి, గుర్ల, బుదరాయివలస పోలీసు స్టేషన్ల పరిధిలోనూ వీరు చేసిన నేరాలు అంగీకరించారని తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.5.05 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ట్రాక్టర్, బొలెరో వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో సీఐ ఎస్.వి.ప్రభాకరావు, ఎస్ఐ యు.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

రాజాం రూరల్: మండలంలోని నర్సింహపురం గ్రామానికి చెందిన బూరాడ నరసింగరావు, ఆయన చిన్నాన్న ఆదినారాయణ మధ్య నెలకొన్న భూవివాదంతోపాటు భూమిలో ఉన్న పంట విషయంలో తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీసింది. దీంతో ఇరువర్గాలు రాజాం పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ మేరకు సీఐ మోహనరావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొట్లాటలో గాయపడిన వారంతా రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యపై నిరసన


నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

కొత్తవలస: తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను తన ఇంటి సమీపంలోనే హత్యచేయడంపై దళితసంఘాలతో పాటు విశాఖ జిల్లా అధ్యక్షుడు బోని కృష్ణ నిరసన తెలిపారు. శనివారం కొత్తవలస జంక్షన్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బోనికృష్ణ మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అప్పలసూరి, అప్పారావు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న 43 పశువుల స్వాధీనం

విజయనగరం క్రైం: విజయనగరంకంటోన్మెంట్ ప్రాంతంలో పశువులను కబేళాకు తరలిస్తున్నట్లుగా ఎస్‌బీ పోలీసులకు సమాచారం రావడంతో ఎస్పీ దీపికా ఆదేశాలతో శనివారం వన్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు వాహనాల్లో 43 పశువులను కబేళాకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న ట్లు సీఐ వెంకటరావు తెలిపారు.డ్రైవర్లు మిరియాల సురేష్, పత్రి శంకరరావుతో పాటు పశువులను అక్రమంగా తరలిస్తున్న అబ్దుల్ బషీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో సీఐ వెంకటరావు, అశోక్‌కుమార్, ఎస్ఐ నరేష్, ఎస్ఐ సాగర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని భారత నాస్తిక సమాజం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని కోట జంక్షన్‌సమీపంలోనికార్యాలయంలో మాట్లాడుతూ బాబాలమోసాలు, నేరాలు, ఎక్కువగా జరుగుతుండడంతో వాటిని అరికట్టాలని కోరారు. బోలేబాబా సత్సంగ్ కార్యక్రమంలో మరణించిన వారిని రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

రేపటి నుంచి ఇసుక ఉచితం

- మూడు స్టాక్ పాయింట్ల నుంచి అందించే ఏర్పాట్లు
- జిల్లాలో సిద్ధంగా 92 వేల టన్నుల ఇసుక
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం-ఆంధ్రజ్యోతి/కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగదారులకు సోమవారం నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమా వేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుకరీచ్‌లు లేకపోవడంతో శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి ఇసుక తీసుకు వచ్చి, కొత్తవలస, డెంకాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాంతాల్లోఉన్న యార్డుల్లో నిల్వలు ఉంచినట్లు తెలిపారు. ఆయా స్టాక్ పాయింట్ల నుంచి జిల్లాలో ఇసుక కావలసిన వారికి ఏర్పాట్లు చేశామన్నారు. మూడు స్టాక్‌పాయింట్ల వద్ద 92 వేలటన్నుల ఇసుక సిద్ధంగా ఉందన్నారు.రోజుకు ఒకో వ్యక్తికి 20టన్నులు మించకుండా సరఫరాచేస్తామని, టన్నుకు రూ.605 చొప్పున ఇసుక హేండ్లింగ్ చార్జీలువసూలు చేస్తామని తెలిపారు.ఇసుక సరఫరా ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబరు, రెవెన్యూ, పోలీస్,గనుల శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు.రవాణాశాఖ నిర్ణయించిన ధరల మేరకు మాత్రమే ఇసుక రవాణా చార్జీలను వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. వినియోగదారులు ఇసుక హేండ్లింగ్ ఛార్జీలు చెల్లించి వారు ఇసుకను తీసుకు వెళ్లేందుకు వీలుగా ట్రాన్సిట్ రసీదు ఇస్తా రని తెలిపారు. గ్రామాల్లోఉన్న గెడ్డలు, వాగుల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏ గ్రామంలో ఉన్న గెడ్డ, వాగుల నుంచి ఆ గ్రామస్థులు మాత్రమే ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమ తిస్తారన్నారు. ఇసుక సరఫరా ఫిర్యాదులు, సలహాల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా టోల్‌ఫ్రీ నెంబర్ 9032338135 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు లేదా సలహాలు అందించవచ్చని చెప్పా రు. ఉచిత ఇసుక సరఫరాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని మండల, డివిజన్, గ్రామ వార్డు సచి వాలయాల్లో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ కార్తీక్, సెబ్ ఏఎస్పీ అస్మాపరహీన్, డీఆర్‌వో అనిత, ఆర్డీవోలు సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి, డీడీ సూర్యచందరరావు, డీడీ దుర్గా ప్రసాద్, రవాణా శాఖ ఉప కమీషనర్ మణకుమార్, కాలుష్య నియంత్రణామండలి ఈఈ సరిత, జలవనరుల శాఖ ఈఈ సీతారామ నాయుడు, డీపీఓ శ్రీదర్‌రాజా పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి


మంత్రి శ్రీనివాస్‌ని సత్కరిస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలోని శిష్టకరణాలను ఓబీసీలోచేర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషిచేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు కోరారు. ఈమేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని శనివారం గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలిశారు. ఈసందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో శిష్టకరణాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిసి సమస్యలను వివరించామన్నారు. కార్యక్రమంలోసంఘ ప్రతినిధులు వెంకటేష్, పరమేశ్వరరావు, జోగారావు, బలివాడ వెంకట రమణారావు, తిరుపతిరావు, త్యాడప్రసాద్‌పట్నాయక్, శ్రీనివాస్, బాలు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలకు స్పెషల్‌డ్రైవ్: డీఈవో


మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

బొబ్బిలి: బడిబయటఉన్నవారిని బడిలో చేర్పుకునేందుకు వచ్చే నెల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం బొబ్బిలిలోని పలు హైస్కూళ్లను డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు.తొలుత ఓ పాఠశాలపై వచ్చిన ఆరోపణలపై విద్యార్థి సంఘం నాయకులతో కలిపి విచారణ జరిపారు. అనంతరం ప్రభుత్వ బాలికలఉన్నతపాఠశాల, గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూళ్లను ఆయన సందర్శించారు.బాలికల హైస్కూల్‌లో ఉపాధ్యాయుల మధ్య విభేదాలు ఉన్నట్లు ఫిర్యాదులు నేపథ్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీబీఎస్ఈ సిలబస్ అమలవుతున్న 63 పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు.ఎంఈవోలు, సీనియర్ హెచ్‌ఎంలతో ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యాపరమైన అన్ని మస్యల పరిష్కారానికి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. జిల్లాకు ఇంకా యూనిఫామ్‌దుస్తులు రాలేదన్నారు.పిరిడి జిల్లాపరిషత్ హైస్కూలులో మధ్యాహ్నభోజనం పథకం అమలులో లోపాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవోలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు, హెచ్‌ఎంలు ఉన్నారు.

అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలపై అధికారులను సర్పంచ్‌లు నిలదీశారు. మల్లంపేట, పూడివలస సర్పంచ్‌లు వంగపండు పద్మ, రెడ్డి తిరుపతినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని, పలుసార్లు పంచాయతీ అధికారి సూర్యనారాయణకు విన్నవించిన పట్టించుకోలేదని, గ్రీన్‌అంబాసీడర్ల జీతాలు రెండేళ్ల నుంచి రాలేదనిచెప్పినా ఇంకా వైసీపీ మోజులో ఉండి, కాలయాపన చేస్తున్నారన్నారు. వాడాడ ఎంపీటీసీ రెడ్డి సునీతవిద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మం డిపడ్డారు. పలుగ్రామాల్లో విద్యుత్‌వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, ఇళ్లపై, పంటపొలాల్లో ఎక్కడికక్కడే పడి ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ తాగు,సాగునీరు సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రామారావు, వైస్ ఎంపీపీలు భాస్కరరావు, రమేష్ పాల్గొన్నారు.


ఈవోపీఆర్డీని నిలదీస్తున్న సర్పంచ్ పద్మ

మెరుగైన వైద్యం అందించాలి: అదితి

విజయనగరం రింగురోడ్డు: తల్లీపిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. శనివారం విజయనగరంలోని మహారాణి ఘోషాసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సౌకర్యాలపై వైద్యులతో మాట్లాడారు. అనంతరం ప్రతి వార్డుని తిరిగి సౌకర్యాలపై ఆరాతీశారు కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలనాయుడు, హెచ్‌వోడీ అరుణాశుభశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

రాజాం: ఎస్సీ కాలనీల్లో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం కోరారు.ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను శనివారం కలిశారు. కాగా జిల్లాపై తనకు అవగాహన ఉందని, మండల స్థాయి అధికారులుస్థానిక నాయకులు సహకారంతో ముందుకువెళ్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్సీ సెల్ నాయకులు రేగాన రామారావు, రేగాన అప్పలనాయుడు, తేగల శంకరరావు, వర్రి రమేష్ దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'జనసేన దృష్టికి సమస్యలు తీసుకురావాలి'

రాజాం: గ్రామస్థాయిలో సమస్యలు పార్టీ దృష్టికి తీసుకురావాలని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి యాపీ రాజు కోరారు. శనివారం రాజాం జనసేన కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు గార శివరాం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ విజయానికి కృషిచేసిన జనసేన నాయకులను అభినందించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి సైడాల జగదీశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'కాగార్'కు వ్యతిరేకంగా సన్నద్ధం కావాలి

- విరసం అధ్యక్షుడు పాణి


మాట్లాడుతున్న పాణి

బొబ్బిలి: గ్రీన్‌హంట్, సమాధానం వంటి ఆపరేషన్ల తరువాత తాజాగా ఆపరేషన్ కాగార్ తీసుకొచ్చారని, ఈ యుద్ధానికి వ్యతిరేకగా సన్నద్ధం కావాలని విరసం అధ్యక్షుడు పాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో గంటి ప్రసాదం 11 వర్ధంతి సభను పీకేఎస్ నాయకుడు తమటాల అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాణి మాట్లాడుతూ విప్లవోద్యమం ఆవిర్భావం నుంచి నేటి వరకు వేలాదిమందిని పాలకులు హతమార్చారన్నారు. అన్ని రాజకీయ పార్టీల అజెండా ఒక్కటేనని మావోయిస్టులను తుదముట్టించడమేనని తెలిపారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి మాట్లాడుతూ ఆదివాసీలు, మూలవాసుల మనుగడకు దెబ్బతీసే విధంగా అటవీసంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకు పాలకులు విచక్షణారహితంగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. సభలో ఇఫ్టూ, సీఐటీయూ నాయకులు పిల్లా లక్ష్మణరావు, పి.శంకరరావు, పీకేఎస్ నాయకులురాయితీ సత్యం, దాసరి వెంకటరమణ, నల్లి తవిటినాయుడు, కుమార్‌నాయుడు, సుధీర్, ప్రజాకళామండలి నాయకులు తూముల సింహాచలం, బొడ్డేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కలిశెట్టికి స్వాగతం పలికిన టీడీపీ నాయకులు

బొబ్బిలి: ఎంపీగా ప్రమాణ స్వీకరంచేసిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడుకు శనివారం విజయనగరంలో బొబ్బిలి టీడీపీ నాయకులు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఎమ్మెల్యే బేబీనాయన తరపున ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికారు. కౌన్సిలర్ బొత్స సురేష్, 13 వ వార్డు ఇన్‌చార్జి బొట్టశివ, పార్టీ మండలాధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, గుల్ల హరికృష్ణ, నారాయణరావు తదితరులు ఎంపీకి వీరంతా బొబ్బిలి వీణను బహూకరించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

కొత్తవలస: ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. రెల్లి రెవెన్యూ సర్వేనెంబరు 26-5 ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాన్ని తమ సిబ్బంది తొలగించినట్లు చెప్పారు.కొత్తవలస రెవెన్యూలో గల 168 సర్వేనెంబరులో అక్రమంగా నిర్మిస్తున్న ట్లు సమాచారం రావడంతో పరిశీలించి తొలగించినట్లు తెలిపారు.

అధిక దిగుబడికి కృషి చేయాలి

రేగిడి: చెరకు అధిక దిగుబడికి కృషిచేయాలని, కంపెనీ ఇచ్చే ప్రోత్సాహకాలను రైతులు వినియోగించుకోవాలని ఈఐడీ ప్యారీ ముఖ్య నిర్వహణ అధికారి హసిఫ్ జేఏ హచ్ సూచించారు. శనివారం ప్యారీ కర్మాగారం పరిధిలోని రాజాం, పొందూరు మండలాల్లోని పలు గ్రామాల్లో చెరకు పంట క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో కేన్ విభాగధిపతి జె.రాజేంద్రన్, యూనిట్ హెడ్ పట్టాబిరామిరెడ్డి పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలి

రాజాం: వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పురపాలకసంఘం కమిషనర్ జె.రామప్పల నాయుడు కోరారు. శనివారం పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో షాపులు యజమానులు, వ్యాపారులు, పండ్లు బళ్ల, చికెన్, మటన్, కురగాయలు షాపులు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి కన్వీనర్ టీటీవీ రమణమూర్తి, ఏఈ భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట కొట్టాంవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తనిఖీ చేశారు.స్థానిక పోతిరాజు పట్టి వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన జాతరలోపాల్గొన్నారు. ఆమె వెంట నాయకులు రమణాజీ, కొణదం మల్లేశ్వరరావు ఉన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

రాజాం రూరల్: రాజాం జీఎంఆర్ఐటీలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ నార్త్ కరోలినాకు చెందిన ప్రొఫెసర్ మిలింద్‌ఖిరే, ఎస్ఆర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ తమ సందేశాలను ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. వ్యర్థాల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను మిలింద్ ఖిరే వివరించారు. రెండు రోజుల సదస్సులో 136పరిశోధన పత్రాలను పరిశోధకులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జె.గిరిష్, పలుశాఖాధిపతులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

రాజాం రూరల్: ద్విచక్ర వాహనచోదకు లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవా ధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు. రాజాం కోర్టు ప్రాంగణంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ, రాజాం రూరల్ సీఐ. ఎస్.శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లతో ప్రమాదాలు


నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన స్పీడ్‌బ్రేకర్

వంగర: రాజాం-వంగర రహదారిలో మద్దువలస రెండో మైలు రాయివద్ద కొందరు యువకులు నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్‌బ్రేకర్లు నిర్మించడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వారంరోజుల కిందట సరసనాపల్లికి చెందిన యువకులు రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు నిర్మించారు.ఆ ప్రదేశంలోప్రమాదకమైన మలుపు ఉండడంతో తరచూ వాహనచోదకులు ఇబ్బందులకు గుర వుతున్నారు.కాగాఅక్కడ స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆర్అండ్‌బీ ఏఈ కేవీ స్వామి తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే మురళీమోహన్ పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులకు తొలగించాలని ఆదే శించారని చెప్పారు. తొలగించడానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.

అరసాడలో అనధికార లేఅవుట్లు

వంగర: భూముల ధరలకు రెక్కలు రావడంతో అరసాడలో అనధికారలేఅవుట్లు వెలుస్తున్నాయి. రైతుల దగ్గర భూములు కొనుగో లు చేసిన కొంతమంది నిబంధ నలకు విరుద్ధంగా వాటిని రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. అరసాడలో 16 లేఅవుట్లు వెలిసినా ఇక్కడ రెండు లేఅవుట్లకు మాత్రమే నాలాచెల్లింపులు జరిగాయన్నది బహిరంగరహస్యం. రాజాం-వంగర రహదారిలో పంట భూములు లేఅవుట్లుగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. పాలకొండకు చెందిన ఓ వైసీపీ నాయకుడి కుమారుడి కనుసన్నల్లో అరసాడలో ఈతతంగం జరుగుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.కాగా అరసాడలో అక్రమ లేఅవుట్లపై విచారణకు ఆదేశిస్తానని సూపరింటెండెంట్ సుందరరావు చెప్పారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి

● జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ వైవీ రమణ
● జూనోసిస్ దినోత్సవం


విజయనగరంలో శునకాలకు మందులు, ఆహారాన్ని అందిస్తున్న దృశ్యం


చీపురుపల్లి: కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ శారద


డెంకాడ: టీకాల కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కంది తదితరులు

విజయనగరం రింగురోడ్డు: పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ డా.వైవీ రమణ, నగర పాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు చెప్పారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. అనంతరం వివిధ జాతులకు చెందిన శునకాలకు ఉచితంగా టీకాలు వేయడంతో పాటు మందులు, ఆహారాన్ని అందించారు. సహాయ సంచాలకులు డా.కేవీ రమణ, డా.దర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు. ● **కొత్తవలస:** కొత్తవలస పశువైద్య ఏడీ కార్యాలయం పరిధిలోగల పశువైద్యశాలలో జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేసినట్టు ఆ శాఖ ఏడీ గంగాధరరావు తెలిపారు. పశు వైద్యశాలలో 180 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు చెప్పారు. ● **లక్కవరపుకోట:** జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాధులు సక్రమించకుండా వ్యాక్సిన్ వేస్తున్నామని ఎల్.కోట, వేపాడ మండలాల పశువైద్యులు కె,గాయిత్రీ, సింహచలంనాయుడు తెలిపారు. శనివారం 46 మంది తమ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించినట్లు చెప్పారు. ● **భోగాపురం:** భోగాపురం, ముంజేరు, పోలిపల్లి గ్రామాల పశువైద్యశాలల్లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పెంపుడు శునకాలకు రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డా.ఉమాశంకర్ మహాపాత్రో, డా.రామరాజు, డా.కమల కుమారి తదితరులు పాల్గొన్నారు. ● **చీపురుపల్లి:** ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని చీపురుపల్లి పశు సంవర్ధక శాఖ ఏడీ డా.ఆర్.శారద సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా తమ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో డా. హైమవతి, మెరకముడిదాం ఎల్ఏఎస్ వాసుదేవ్, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.● **డెంకాడ:** అక్కివరం పశువుల ఆసుపత్రిలో శనివారం పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై స్పందించండి

● ఎమ్మెల్యే కళా వెంకటరావు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి: ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శనివారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వైద్య, ఆరోగ్యం వంటి సౌకర్యాల కల్పనలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల ఫిర్యాదుల పట్ల స్పందించాలన్నారు. రైతుల సమస్యలు వెనువెంటనే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫారాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, బీజేపీ ప్రతినిధులు ఇప్పిలి నీలకంఠం, ఎస్వీఎల్ఎన్ రాజు, ఎంపీడీవో డి.శ్వేత, తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, హెచ్ఎం చంద్రశేఖర్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.నాయక్, అధికారులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న సునీల్ రాజ్‌కుమార్

నెల్లిమర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధన కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆ పాఠశాలల రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్ సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అంబేడ్కర్ గురుకులాల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్త్ సూపర్‌వైజర్లకు శనివారం నెల్లిమర్లలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. గురుకులాల్లో మంచి ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. పాఠశాల వాతావరణాన్ని ఇంటి వాతావరణంగా మార్చాలని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులుగా ఆప్యాయతగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ స్కిల్స్‌పై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త పద్మజ, నెల్లిమర్ల కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పురుగు మందుల షాపు సీజ్


శాంపిల్స్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని వాసవీ పురుగు మందుల షాపును అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఈ షాపును తనిఖీ చేశారు. పురుగు మందుల నమూనాలను సేకరించారు. మండల వ్యవసాయాధికారి వి.వెంకటయ్య ఆధ్వర్యంలో ఏఈవోలు విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సుమారు రూ.లక్షా84 వేల విలువైన విత్తనాలు, రూ.7లక్షల విలువ చేసే పురుగు మందులు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించి షాపును సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులపై దాడులు

గజపతినగరం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలన్న లక్ష్యంతో ఫెర్టిలైజర్స్ షాపులపై దాడులు నిర్వహించనున్నట్టు విజిలెన్స్ డీఎస్పీ తాతారావు తెలిపారు. శనివారం రాత్రి మెంటాడ రోడ్డులో గల శ్రీసత్యసాయి ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 30 బృందాలతో దాడులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. షాపుల్లో విత్తనాలు, ఎరువుల్లో కల్తీ ఉంటే తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. దాడులు నిర్వహిస్తున్న సమయంలో కొన్ని షాపులు మూసివేస్తున్నారని అటువంటి వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏడీ గంగాధర్, ఏవో ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ నాయకుడు ఉమామహేశ్వరరావు మృతి

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్ మిల్లు ఇఫ్టూ కార్మిక సంఘం నాయకుడు ఉరిటి ఉమామహేశ్వరరావు(74) స్థానిక గాంధీనగర్ కాలనీలోని తన స్వగృహంలో గురువారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆయన మరణ వార్త కార్మిక వర్గంలో తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. 1991లో ఇఫ్టూ నాయకత్వాన్ని ఏలూరు నుంచి నెల్లిమర్లకు తీసుకురావడంలోనూ, 1990-2000 దశకంలో నెల్లిమర్లలో తీవ్ర స్థాయిలో కార్మిక ఉద్యమ పోరాటాల నిర్వహణలోనూ ఉమామహేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఉమామహేశ్వరరావుకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన పార్థివ దేహాన్ని పలువురు సందర్శించి, నివాళులు అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, మజ్జి ఆదినారాయణ, అల్లి శ్రీనివాసరావు, ఇఫ్టూ, సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

భోగాపురం: పంచాయతీ అభివృద్ధి జరిగేలా అందరూ సహకరించాలని ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. భోగాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ చెరువు గట్లు ఆక్రమణలకు గురయ్యాయని, అనేక మంది ఆక్రమించుకొని వాటిని ఇతరులకు అద్దెలకు ఇచ్చి లాభం పొందుతున్నారని తెలిపారు. బట్టికాలువలో పూడిక తీత, సీసీ రహదారులు ఏర్పాటు, ఇంటింటి తాగునీటి కొళాయిలు, తదితర సమస్యలు పరిష్కరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సురేష్, ఏవో హరికృష్ణ, ఇరిగేషన్ జేఈ కనకమహాలక్ష్మి, నాయకులు కొమ్మూరు సుభోషణరావు, పడాల భానుప్రకాష్, ఆళ్ల శ్రీనివాసరావు, వరుపుల సుధాకర్, గుండపు సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు. నందిగాం పంచాయతీలో జరిగిన గ్రామసభలో వివిధ సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

ఆధునిక పద్ధతుల్లో బోధించాలి

రామభద్రపురం: విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధించాలని డిప్యూటీ డీఈవో కె.మోహనరావు ఉపాధ్యాయులకు సూచించారు. పాతరేగ, బూసాయివలస, కస్తూర్బా గాంధీ పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. వంటలు వండే ప్రదేశం అపరిశుభ్రంగా ఉండడంతో ఉపాధ్యాయులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మస్తర్లలో తేడాలను సహించం

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండుపూటలా పనిచేయాలని, మస్తర్ నమోదులో ఎటువంటి తేడాలు ఉండకూడదని ఉపాధి ఏపీఓ ఎస్ హరినాథ్ స్పష్టం చేశారు. వావిలవలసలో శనివారం వాల్తేరుబట్టికి జరుగుతున్న ఉపాధి పనిని ఏపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకరికి బదులు ఇంకొకరిని అనుమతించకూడదని క్షేత్రసహాయకురాలు భవానిని ఆదేశించారు. హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం బాధ్యత వహించాలి

రేగిడి: ఖరీఫ్ కాలంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు శనివారం స్వగ్రామం సంకిలిలో విలేకరులతో మాట్లాడారు. విత్తన సక్రమ సరఫరాలో ప్రభుత్వం ఈ ఏడాది విఫలమైందని..ఎరువుల సరఫరాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది, కొరత లేకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

కౌలు రైతులకు అండగా ప్రభుత్వం

రేగిడి: గ్రామసభల ద్వారా గుర్తించిన కౌలు రైతులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేసి అన్నిరకాలుగా ఆదుకొంటుందని రాజాం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.చంద్రరావు, ఏఓ మురళీకృష్ణ పేర్కొన్నారు. బూరాడ, లింగాలవలస, తోకలవలస గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలో దాదాపు 20 రెవెన్యూ గ్రామాల్లో 82 మందిని గుర్తించినట్టు ఏడీ తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా: ఎంపీ కలిశెట్టి


భోగాపురం: ఎంపీని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, బంగార్రాజు

భోగాపురం: అందరి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా జిల్లాకు వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడుకు శనివారం రాజాపులోవ సమీప లేఅవుట్ వద్ద నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గజమాల, దుశ్శాలువలతో సత్కరించారు. అభిమాని తెచ్చిన సైకిల్‌ను ఎంపీ కొంత దూరం తొక్కడంతో శ్రేణులు కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురు నాయకులు భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ఘన స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, తదితరులు ఆయన్ని గజమాలతో సత్కరించారు. పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, చింతపల్లి వెంకటరమణ, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, ఎంఎం నాయుడు, రవ్వా నాని పాల్గొన్నారు. ● **డెంకాడ:** ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజయం సాధించిన తరువాత తొలిసారిగా శనివారం డెంకాడకు వచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాణిరాజు, చిరంజీవిరాజు, ప్రదీప్‌రాజు, కాగితాల సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

జగ్జీవన్‌రామ్‌కు నివాళి

లక్కవరపుకోట: జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మ జ్యోతిరావ్ పూలే బాలికల పాఠశాలలో శనివారం బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో ఆధ్వర్యంలో జి.స్వప్నప్రియ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పుస్తక పఠనంపై అవగాహన

గరివిడి: గరివిడిలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో సంచార గ్రంథాలయం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ ధనలక్ష్మి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

విజయనగరం రూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని జిల్లా సహకార శాఖాధికారి పి.రమేష్ చెప్పారు. జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని డీసీసీబీ కార్యాలయంలో శనివారం సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు అధికారి నాగరాజు, డీసీసీబీ ఇన్‌చార్జి సీఈఓ సీహెచ్.ఉమామహేశ్వరరావు, డీసీసీబీ జీఎం కేవీపీ సూర్యనారాయణ, డిప్యూటీ రిజిస్ట్రార్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ పూర్తి చేయండి

చీపురుపల్లి: చీపురుపల్లి ఆర్వోబీ త్వరగా పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు స్థానిక జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎంపీగా విజయం సాధించిన అనంతరం తొలిసారిగా విజయనగరం వచ్చిన ఆయనను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు శనివారం అశోక్ బంగ్లాలో కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే చీపురుపల్లి మండలంలో ఈనాం భూముల సమస్య పరిష్కారమయ్యేలా ఎంపీ ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో జనసేన నాయకులు శంకర్, తెలుగుదేశం నాయ కులు రేగాన రామారావు, దాసరి వెంకన్న, కె.రామారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో శనివారం పునర్వసు నక్షత్ర పూజా కార్యక్రమాలతో పాటు పంచామృత అభిషేకాలు, పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. జూన్ నెల పునర్వసు నక్షత్రం దినం నుంచి జూలై నెల పునర్వసు నక్షత్రం శనివారం వరకు అర్చకులు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల చివరి రోజును పురస్కరించుకుని స్వామి వారికి పంచామృత అభిషేకాలుతో పాటు పట్టాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించగా, దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

టీడీపీ నాయకుడు అప్పలనాయుడు మృతి

పూసపాటిరేగ: టీడీపీ సీనియర్ నాయకుడు బొంతు అప్పలనాయుడు(72) శనివారం జిల్లా కేంద్రంలోగల ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. స్వగ్రామమైన పేరాపురం పంచాయతీకి సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, జడ్పీటీసీ సభ్యుడిగా వ్యవహరించారు. ఆయన మృతి పట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ మండలాధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, పతివాడ తమ్మినాయుడు, ఆకిరి ప్రసాదరావు సంతాపం తెలిపారు.

మహిళా రైతుల ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారీ

జామి: చింతాడ గ్రామంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఏపీఎం తేజేశ్వరి ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ తయారు చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తేజేశ్వరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చింత, కాగు, వేప, నేరేడు విత్తనాలతో సీడ్‌బాల్స్ తయారు చేసి వ్యవసాయంలో వినియోగించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

గురుకులానికి పది ఫ్యాన్లు వితరణ

రాజాం: రేగిడి మండలంలోని ఉంగరాడ మెట్ట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రాజాం రోటరీ క్లబ్ ప్రతినిధులు పది ఫ్యాన్లు వితరణ చేశారు. శనివారం వీటిని ప్రిన్సిపాల్ సూర్యనారాయణకు అందజేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, మల్లా శేషగిరి, తోట తిరుమల పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలు

● రూ.60 లక్షల దుర్వినియోగం ● సామాజిక తనిఖీల్లో వెలుగులోకి

డెంకాడ: గత 15 రోజులుగా మండలంలోని 24 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం, హౌసింగ్, పింఛన్లకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.60లక్షలు దుర్వినియోగం అయినట్టు గుర్తించామని ఎస్ఆర్‌పీ లక్ష్మణరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో 9 మంది సీఆర్పీలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎన్నో అక్రమాలు, హౌసింగ్‌లో అవకతవకలు, బినామీ పేర్లతో ఉపాధి వేతనాల చెల్లింపు, చెరువు పనుల్లో కొలతల తేడాలు, అర్హత లేని వారికి పింఛన్ల కొనసాగింపు తదితరవాటికి సంబంధించి రూ.60లక్షలు దుర్వినియోగమైనట్టు గుర్తించామని ఆయన తెలిపారు ఈ నివేదికను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, ఓ.ఎంబీయూడీఎస్ పర్సన్ అన్నపూర్ణలకు సమర్పించారు. గ్రామాల్లో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో నిర్మాణాలు చేపట్టకుండా బిల్లులు చెల్లింపులతో పాటు, చెరువు పనుల్లో బినామీ కూలీలకు వేతనాలు చెల్లించినట్టు తెలిపారు.

ప్రజలు లేని సామాజిక తనిఖీ ప్రజావేదిక

మండలంలోని ఏ ఒక్కరూ పాల్గొనకుండా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం. ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండరాజుపేటలో ఆరేళ్ల కిందట కట్టిన ఇంటికి సుమారు రూ.లక్షా 50వేలు ఉపాధి హామీ పథకంలో బిల్లు చేయడం గమనార్హం. డెంకాడ జగనన్న కాలనీలో పునాది లకే పరిమితమైన 70 ఇళ్లకు శ్లాబు బిల్లులు ఇచ్చినట్టు నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో లోవరాజు, ఎంపీపీ వాసుదేవరావు, సీడబ్ల్యూఎస్ జేఈ సూర్యకుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి భానోజీరావు, ఈపీడీ జనార్ధన్, డెంకాడ ఇన్‌చార్జి ఏపీవో ఆదిబాబు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మోహర్రం ఉత్సవాలు

విజయనగరం రూరల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి మోహర్రం ఉత్సవాలు ప్రారంభం కానున్నా యి. ఈ మేరకు ముస్లిం సంఘ ప్రతినిధులు అన్ని మసీదు ల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు సంబంధించి మసీదులు సిద్ధమయ్యాయి. నగరంలోని కంటోన్మెంట్, అంబటిసత్తర్వు, కోట, అబాద్‌వీధి, బాబామెట్ట తదితర ప్రాంతాల్లో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయని నగర శాఖ ముస్లిం ప్రతినిధి మహ్మద్ గౌస్ తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే గుర్తింపు

విజయనగరం క్రైం: పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే గుర్తింపు ఉంటుందని విజయనగరం వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన వన్‌టౌన్ పోలీసు సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ దీపిక ప్రశంసాపత్రాలను అందించారు. శనివారం సీఐ వెంకటరావు సిబ్బందికి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో వీటిని అందజేసి అభినందనలు తెలిపారు.

జూనోసిస్ వ్యాధుల నియంత్రణకు అవగాహన అవసరం

● సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్‌రావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్‌రావు

ఒడిశా

పర్లాకిమిడి: జూనోసిస్ వ్యాధులను నియంత్రించేందుకు అవగాహన అవసరమని సెంచ్యూరియన్ యూనివర్శిటీ వైస్‌ప్రెసిడెంట్, ప్రొఫెసర్ డీఎన్‌రావు అన్నారు. పర్లాకిమిడి సెంచ్యూరియన్ యూని వర్శిటీలో శనివారం జునోసిస్ దినోత్సవాన్ని స్కూల్‌ఆఫ్ వెటర్నరీ, యానిమల్ సైన్స్ వెటర్నరీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జంతువులు, పెంపుడు జీవాలకు కచ్చితంగా టీకాలు అందించాలన్నారు. యూనివర్శి టీ అధ్యాపకులు సోహస్ రచించిన 'గొర్రెలు, మేకల వైద్యం-సహ సంరక్షక సేవలు' అనే పుస్తకాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అనితపాత్రో ఆవిష్కరించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పెంపుడు కుక్కల సంరక్షణపై అవగాహన పెంపొందిం చేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్‌సీ నందా, ఆర్‌కె.స్వాయి, ఐకార్-సీఐఎఫ్‌ఏ శాస్త్రవేత్త ప్రియంబత్ర తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు రెయిన్ కోట్లు


ట్రాఫిక్ సిబ్బందికి రెయిన్‌కోట్ అందిస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న 72 మంది ట్రాఫిక్ పోలీసులకు శ్వేత హార్డ్‌వేర్ ఎలక్ట్రికల్స్ యాజమాన్యం అందజేసిన రెయిన్ కోట్లను ఎస్పీ దీపిక శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు ఎండలోనూ, వర్షంలోనూ విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈసందర్భంగా హార్డ్‌వేర్ యాజమాన్యం ఇందుకూరి సుమన్‌కు ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రంగనాథం, ఎస్ఐ రాజు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులను బాగుచేయాలి

● అధికారులను కోరిన ప్రజాప్రతినిధులు


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గంట్యాడ: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన రహదారులను బాగు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొటారుబిల్లి కూడలి నుంచి బుడతనాపల్లి, చినమానాపురం, పెణసాం, గొడియాడ, పెణసాం గ్రామాలకు వెళ్లాల్సిన రోడ్ల పరిస్థితి పూర్తిగా బాగాలేదని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు తెలిపారు. కొటారుబిల్లి కూడలి నుంచి సిరిపురం, మురపాక, పెదవేమలి, చంద్రంపేట, వసంత గ్రామాల రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతిన్నదని అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఈసందర్భంగా జేఈ నందకుమార్ మాట్లాడుతూ కొటారుబిల్లి కూడలి నుంచి బుడతనాపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతులకు రూ.5లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తున్నా విద్యార్థులు ఎక్కువగా చేరడం లేదని, దీనికిగల కారణం ఏమిటని మురపాక సర్పంచ్ రమేష్ ప్రశ్నించారు. దీనిపై ఎంఈవో విజయకుమారి స్పందిస్తూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, ఎంపీడీవో భవాని, వైస్ ఎంపీపీ వెంకటలక్ష్మి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.